పోర్టల్ తెరవరు.. కొత్తోళ్లకు ఇవ్వరు!

- కొత్తగా పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి అందని రైతుబంధు
- పేపర్‌పైనే కొత్త రైతులకు రైతు బంధు
- దరఖాస్తులకే పరిమితమైన వ్యవసాయ శాఖ


ఎదులాబాద్‌లో నాటడానికి సిద్ధంగా ఉన్న వరి నారు

ఘట్‌కేసర్: అన్నదాత పంట పెట్టుబడి కోసం ఇబ్బందులు రాకుండా తెలంగాణ ప్రభుత్వం రైతు బంధు పథకం అమలు చేస్తోంది. ఏడాదిలో ఎకరాకు రూ.10వేల చొప్పున పంట సాయం అందజేస్తోంది. రైతు బంధు కోసం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలనే సర్కారు ప్రకటనతో జిల్లాలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు దరఖాస్తు చేసుకున్నారు. డిసెంబర్ 28 నుంచి రైతుబంధు విడుదల చేయగా ఇటీవల కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన వారికి సాయం అందడం లేదు. మాకెందుకు రావడం లేదని వ్యవసాయాధికారులను అడగగా రైతుబంధు పోర్టల్ తెరుచుకోవడం లేదని అధికారులు చెప్పుకొస్తున్నారు. పొమ్మనలేక పొగబెట్టిన విధంగా కొత్త రైతులకు రైతుబంధు ఇవ్వలేమని నేరుగా చెప్పలేక ప్రభుత్వమే రైతుబంధు పోర్టల్‌ను మూసివేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కారు నిర్ణయంతో జిల్లాలో కొత్తగా పాసు పుస్తకాలు పొందిన వేలాది మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి బాసిత్‌ను వివరణ కోరగా పోర్టల్ తెరుచుకోవడం లేదని, పోర్టల్ తెరుచుకున్న అనంతరం కొత్త రైతుల భూముల వివరాలు నమోదు చేస్తామన్నారు.

పోర్టల్‌లో పేరు లేకపోతే సాయం రాదు...

గతంలో రైతు బంధు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతుబంధు పోర్టల్‌లో రెవెన్యూ శాఖ అధికారుల సమాచారం మేరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. గతేడాది నుంచి కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన వివరాలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నమోదు చేసేందుకు లాగిన్ ఇచ్చారు. రైతుబంధు ఇచ్చే పక్షం రోజుల ముందు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతుల వివరాలు అధికారులు పోర్టల్‌లో నమోదు చేసేవారు. ప్రస్తుతం పోర్టల్ తెరుచుకోకపోవడంతో కొత్త రైతులకు సాయం అందడం లేదు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారిని 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా శుక్రవా రం సమావేశం ఉందని, శనివారం ఫోన్ లేపకుండా దాటవేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారి బాసిత్‌ను వివ రణ కోరగా రైతు బంధు పో ర్టల్ ప్రస్తుతం తెరుచుకోవ డం లేదని, దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు తెరుచుకున్న అనంతరం అప్‌లోడ్ చేస్తామని చెప్పడం గమనార్హం.



దరఖాస్తు చేసినా సాయం అందలేదు..



తమ కుటుంబ సభ్యులం ఇటీవల 5.30 ఎకరాల భూమిని మార్పిడీ చేసుకున్నాం. రైతు బంధు కోసం దరఖాస్తు చేసిన సాయం అందలేదు. అధికారులను అడిగితే రైతు బంధు పోర్టల్‌లో నమోదు కాలేదని అన్నారు.

– కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, రైతు, చందుపట్లగూడ

ప్రభుత్వం కావాలనే సాయం నిలిపేసింది..



రైతు బంధు కోసం కొత్త రైతులు నమోదు చేసుకోవాలని చెప్పిన సర్కారు రైతు బంధు ఎందుకు ఇవ్వడం లేదు. రైతుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయనందునే పెట్టుబడి సాయం అందడం లేదు. సర్కారు కావాలనే రైతు బంధు పోర్టల్‌ను నిలిపేసింది.

– బద్దం గోపాల్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు

సర్కారుకు చిత్తశుద్ధి లేదు..



పెట్టుబడి సాయంపై సర్కారుకు చిత్తశుద్ధి లేదు. కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన వారు పంట పెట్టుబడి కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పి పోర్టల్ నిలిపేయడం అంటే కావాలనే చేసినట్లయింది.

– కొమ్మిడి శోభారాణి, రైతు, అంకుషాపూర్

క్లుప్తంగా

మౌలిక సదుపాయాలు కల్పించండి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర నాయకుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్ అన్నారు. ఆదివారం నాచారం ఫైర్‌విక్టమ్ కాలనీలో కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ గ్రామ పంచాయతీ నుంచి కార్పొరేషన్‌గా ఏర్పడినా మౌలిక సదుపాయాలు కల్పించడంలో మేయర్, డిప్యూటీ మేయర్ పాలక వర్గం విఫలమైందన్నారు. రాబోయే రోజుల్లో డీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పద్మారావు, నాగేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఇరుముడి పూజ


పూజలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ

కీసర: చీర్యాలలో అయ్యప్ప మాలధారులు నిర్వహించిన ఇరుముడి కార్యక్రమంలో ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, సర్పంచ్ తుంగ ధర్మేందర్, ఉపసర్పంచ్ తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అయ్యప్ప మాలధారులు ఇరుముడి పూజ నిర్వహించారు.

వృద్ధాశ్రమం సందర్శన


వృద్ధులకు పండ్లు, పులిహోరా అందజేస్తున్న లింగంముదిరాజ్

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లోని వృద్ధాశ్రమాన్ని ఆదివారం ప్రముఖ సంఘ సంఘ సేవకుడు జవాది లింగంముదిరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, పులిహోరా పంపిణీ చేశారు. ఈ అనంతరం ఆయన మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లితండ్రులు, వృద్ధులు దైవంతో సమానమని, వారికి సేవలందిస్తే భగవంతుడికి సేవ చేసినట్లేనన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రఘువీర్‌రెడ్డి

కీసర: యువకులు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కీసర సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కీసరలోని సెరినిటీ పాఠశాలలో నేషనల్ చాంపియన్‌షిప్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, మాజీ ఎంపీటీసీ రమేష్‌గుప్తా, జంగయ్యయాదవ్, నాయకులు చిక్కుడు రమేష్, కీసర విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు ఉన్నారు.

చిల్డ్రన్ పార్కు ప్రారంభం


పార్కును ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న పార్కు స్థలాలను అభివృద్ధి చేసి స్థానికంగా ఉన్న కాలనీవాసులు, చిన్నారులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని సాయిధరణీ కాలనీ ఫేస్–2లో చిల్డ్రన్స్ పార్కును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, సీతారామయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్, రమణ కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత సిడ్నీ


బహుమతులు అందుకుంటున్న విజేత జట్లు

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలో రాయల్ కప్ పేరుతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో యునైటెడ్–11 సిడ్నీ జట్టు విజేతగా నిలిచింది. గుండ్లపోచంపల్లిలోని ప్రైవేటు క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మున్సిపాలిటీ, పరిసర గ్రామాలు, పట్టణాలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొనగా ఫైనల్‌లో యునైటెడ్–11 సిడ్నీ, లైటింగ్ బోల్ట్స్ జట్లు ఢీకొనగా సిడ్నీ జట్టు విజేతగా నిలించింది. విజేతలకు కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ బహుమతులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా గోపి, బెస్ట్ బౌలర్‌గా చరణ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా అభిషేక్, బెస్ట్ ఫీల్డర్‌గా గోపిలు బహుమతులు పొందారు.

రంగనాయక స్వామి ఆలయంలో సుదర్శన హోమం

ఘట్‌కేసర్‌టౌన్: ఎదులాబాద్ గ్రామంలో గోదాసమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. తెలవారుజాము నుంచి ఆలయంలో తిరుప్పావై, అర్చనలు, అభిషేకా లు నిర్వహించారు. హోమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి బియ్యం, పూలు, పండ్లను సమ ర్పించారు. వేడుకలో ఆలయ పండితులు తిరువదండం పోరెత్తి పవనాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవత్సాచార్యుల, అనంతసేనాచార్యులు ఉన్నారు.

విద్యతోనే సామాజిక పరివర్తన సాధ్యం


అంబేడ్కర్ పూలమాలలో రాజేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: చదువుతోనే సామాజిక పరివర్తన సాధ్యపడుతుందని ఆనాడే చదువు ప్రాముఖ్యతను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బోధించారని యంనంపేట్ రంగనాయక స్వామి ఆలయాధ్యక్షుడు రాజేశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, చంద్రారెడ్డి, మేకల దాసు, నరసింహ, రాజేశ్, బాలయ్య, మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, గణేశ్, భరత్, విష్ణువర్ధన్, నితిన్ పాల్గొన్నారు.

ఫిస్ట్‌బాల్ పోటీలో 'ఎస్‌కేఎమ్' విద్యార్థిని సత్తా


బహుమతి అందుకుంటున్న మహాలక్ష్మి

మేడ్చల్‌రూరల్: అంతర్ జిల్లా సబ్ జూనియర్ ఫిస్ట్‌బాల్ పోటీల్లో మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామంలోని ఎస్‌కేఎమ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని మహాలక్ష్మి సత్తా చాటింది. మేడ్చల్ జిల్లా ఫిస్ట్‌బాల్ జట్టులో క్రీడాకారిణిగా ఎంపికైన మహాలక్ష్మి ఈ నెల 7, 8వ తేదీల్లో నగరంలోని న్యూ బోయిన్‌పల్లిలో జరిగిన స్టేట్ లెవల్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా జట్టు తరపున ఆడిన మహాలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబర్చి టోర్నమెంట్ బెస్ట్ ప్లేయర్‌గా నిలిచింది. టోర్ని ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర విద్య, సంక్షేమం, మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుగౌడ్, రాష్ట్ర ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ జంపన్న ప్రతాప్, ఎమ్మెల్లార్ గ్రూప్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచిన మహాలక్ష్మిని జిల్లా జట్టు కోచ్ కిరణ్‌గౌడ్, పాఠశాల కరస్పాండెంట్ లవకుమార్‌గౌడ్ తదితరులు అభినందించారు.

విద్యాభ్యాసానికి ఆర్థిక సాయం



శామీర్‌పేట్: ఉద్దెమర్రికి చెందిన ప్రణయ్ తల్లిదండ్రులు మరణించడంతో ప్రస్తుతం పొన్నాల్‌లో నివసించే నాన్నమ్మ ఎల్లమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటున్నాడు. తల్లితండ్రులు లేని ప్రణయ్‌ను చూసి చలించిన పొన్నాల్ గ్రామ ఉప సర్పంచ్ గడ్డం రమేశ్ ఆదివారం బాలుడి విద్యాభ్యాసానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశాడు. కార్యక్రమంలో సర్పంచ్ సుకన్యసత్యనారాయణ, వార్డు సభ్యులు ప్రభాకర్, శివశంకర్, రాజుబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కీసర: మండల రామలింగేశ్వర మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను నాగారంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, నాయకులు దేవయ్య, పురుషోత్తం, మహేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రవిందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాంసింగ్ మృతదేహం

శామీర్‌పేట్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా జీడిమెట్లకు చెందిన రాంసింగ్ మహరాజ్(62) ఆదివారం ఉదయం యాక్టీవా వాహనంపై యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దర్శనం, వాహన పూజ కోసం బయల్దేరాడు. ఈ క్రమంలో జగన్‌గూడ చేరుకోగానే ముందుగా వెళ్తున్న ట్రాక్టర్ (టీఎస్08యూడీ5687) డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనకాల వస్తున్న రాంసింగ్ మహరాజ్ యాక్టీవా వాహనం అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టగా అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అతడి కుమారుడు తండ్రిని 108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. కుమారుడు ధరావత్ దశరథ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ

జవహర్‌నగర్: ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని ఆర్‌సీ ఎన్‌క్లేవ్‌లో నివసించే దివాకర్(35) ఈ నెల 2వ తేదీన భీమవరంకు వెళ్లి ఆదివారం తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగుళగొట్టి చిందరవందరగా వస్తువులు పడి ఉన్నాయి. బీరువాలోని నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గౌడ సంఘం కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం గౌడ సంఘం కేలండర్‌ను సర్పంచ్ వంగూరి శివశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అబేదా బేగం, గౌడ్ సంఘం గౌరవాధ్యక్షుడు స్వామి, అధ్యక్షుడు సత్తయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు నరసింహ, కార్యదర్శులు శ్రీనివాస్, రాములమ్మ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలు


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

మేడ్చల్: యూనివర్సల్ 369 సంస్థ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో ఆదివారం ప్రోటోకాన్ కరాటే పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కరాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, మాస్టర్లు పాల్గొన్నారు.

అభినందనలు


ఈఓకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

ఘట్‌కేసర్: ఎండోమెంట్ ఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన అద్దంకి నాగేశ్వర్‌రావును చౌదరిగూడకు చెందిన యాదవ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు చింతపంటి లింగం యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బాలుయాదవ్, జగదీశ్, రవిగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

చెత్త తొలగింపు


చెత్తను శుభ్రం చేస్తున్న మల్లికార్జున్ ముదిరాజ్

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 13వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ తన వార్డులో ఆదివారం పర్యటించి వీధుల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది సహాయంతో పూర్తిగా తొలగించారు. వార్డులో ఉన్న 20 మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేసి వార్డును శుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఏబీసీడీ వర్గీకరణ పోరుకు సిద్ధమవ్వాలి


మాట్లాడుతున్న వడ్డెపల్లి శివకుమార్

జవహర్‌నగర్: ఏబీసీడీ వర్గీకరణ పోరుకు మాదిగ ఉపకులాలు సిద్ధమవ్వాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మేడ్చల్ జిల్లా కోకన్వీనర్ వడ్డెపల్లి శివకుమార్ మాదిగ అన్నారు. ఈ మేరకు ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఈస్ట్ నందమూరినగర్‌లో ఎమ్మార్పీఎస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మట్లాడుతూ.. నేటి తరం యువత ఎమ్మార్పీఎస్‌లో భాగస్వామ్యం కావాలని, మాదిగ, ఉపకులాలు ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ కోసం మరిన్ని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో జనవరి 11న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాలతో నిర్వహించే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాములు, యాదగిరి, ఎల్లయ్య, కరుణాకర్, సోమయ్య, బిక్షపతి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక...

ఎమ్మార్పీఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్‌మాదిగ సమక్షంలో ఈస్ట్ నందమూరినగర్ ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టేకులపల్లి రఘు, అధికార ప్రతినిధిగా జంజాల సాగర్, ఉపాధ్యక్షులుగా నాగారం స్వామి, ప్రధాన కార్యదర్శిగా జాన్సన్, కోశాధికారిగా గడిపె ప్రసన్న, జయింట్ సెక్రెటరీగా అజయ్, ప్రచార కార్యదర్శులుగా సదీప్, నవీన్, సలహదారులుగా బాబు, యాదగిరిలను ఎన్నుకున్నారు.

'అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే మనకు స్వేచ్ఛ'


జ్ఞాన మాల సమర్పణలో సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కీసర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే నేడు మనం సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కీసర మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 48వ వారం జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవీందర్, ప్రధానకార్యదర్శి దాయర శ్రీనివాస్, ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి ప్రవీన్, నాయకులు గణేష్, తుడం శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు విజయ్‌రెడ్డి, జూపల్లి రవీందర్, నల్ల మధుసుధన్, కందా శివరాంరెడ్డి, చిక్కుడు రమేష్, దయానంద్ గౌడ్, జానకీరామ్, జైహింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే కరాటే, తైక్వాండోలో శిక్షణ తీసుకోవాలి


ప్రతిభ కబర్చిన వారికి బెల్టులు ప్రదానం చేస్తున్న చంద్రారెడ్డి తదితరులు

కీసర: చిన్నతనంలోనే బాలురు, బాలికలు ఆత్మరక్షణ విద్యలైన కరాటే, తైక్వాండోలలో శిక్షణ తీసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీలో పరిధిలోని రాంపల్లి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో టైగర్స్ కలబ్స్ తైక్వాండో అకాడమీ వ్యవస్థాపకుడు శివకుమార్ చిన్నారులకు నిర్వహించి కలర్‌బెల్ట్ టెస్ట్‌తో పాటు ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్ట్‌ల ప్రదానం చేశారు.

కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, నాయకులు సంతోష్‌కుమార్, మధు, గోపి, రాకేష్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు తెలుసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్ట్ జడ్జి జస్టిస్ ఈవీ వేణుగోపాల్

మేడ్చల్: రాజ్యంగం విద్యార్థులకు కల్పించిన ప్రాథమిక హక్కులను విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకుని హక్కులపై అవగాహన కల్పించుకోవాలని హైకోర్ట్ జడ్జి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్ఎస్ స్కూల్‌లో అమెయ పేరుతో నిర్వహించిన స్కూల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఇన్ కం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ శశి అగర్వాల్, కశ్మీరీ ఫైల్స్ సినిమా నిర్మాత అభిషేక్ అగర్వాల్, స్కూల్ చైర్మన్ దయానంద అగర్వాల్, డైరక్టర్లు అంజనీకుమార్ అగర్వాల్, సంజయ్‌కుమార్ అగర్వాల్, గార్వ్ అగర్వాల్, ప్రిన్సిపాల్ షణ్ముగం పరమశివన్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా గిర్మాపూర్ గుట్టల మల్లన్న జాతర


మల్లన్న ఆలయం వద్ద ఎమ్మెల్యే ఈటల రాజేందర్


జాతరలో రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్: ప్రతీ ఏడాది మొదటి ఆదివారం నిర్వహించే గిర్మాపూర్ గుట్టల మల్లన్న జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, మల్లన్న కల్యాణంను వైభవంగా నిర్వహించగా గ్రామస్తులు బోనాలను సమర్పించారు. కొండపోచమ్మ జాతర, అగ్ని గుండాలు, పోతరాజుల నృత్యాలు, తొట్టెల ఊరేగింపు వంటి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నాయకుల పూజలు..

జాతర సందర్భంగా నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డి అన్ని పార్టీల మండల నాయకులు జాతరలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

'భారత సంస్కృతి గొప్ప సంపదతో సమానం'


మాట్లాడుతున్న శేషు మాధవ్

పోచారం: ప్రపంచంలోని ఎన్నో దేశాలు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు ఆకర్షితులవుతున్నాయ ని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ సంచాలకుడు డాక్టర్ మాగంటి శేషు మాధవ్ అన్నారు. అన్నోజిగూడలోని శ్రీవిద్యావిహార్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్ర ముఖ్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సుచి హరిత్ భరద్వా జ్, నిర్వాహకులు మహేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించండి

ఘట్‌కేసర్: స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించాలని ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఆమె పర్యటించి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ శుభ్రత కోసం నిరంతరం పారిశుద్ధ్య కార్మికులు కృషి చేస్తున్నారని, చెత్తను సేకరించే వాహనం డబ్బులు చెల్లించాల్సి వస్తోందని కొందరు ఇంటిలోని వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారన్నారు. చెత్తను ఇంటి వద్దకు వచ్చే చెత్త వాహనంలోనే వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, రాముల, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా చేపట్టే ధర్నాలో సర్పంచ్‌లంతా పాల్గొనాలి

మేడ్చల్: నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నలిగిపోతున్న సర్పంచ్‌ల సమస్యల కోసం కాంగ్రెస్ పార్టీ సోమవారం నగరంలో నిర్వహిస్తున్న ధర్నాకు జిల్లాలోని సర్పంచ్‌లంతా హాజరుకావాలని కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్, పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి కోరారు. హైకోర్టు అనుమతితో నిర్వహిస్తున్న ధర్నాలో సర్పంచ్‌లందరూ పాల్గొని గ్రామాల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించేలా పోరాటం చేయాలన్నారు. పార్టీలను పక్కన పెట్టి సర్పంచ్‌లు ధర్నాకు హాజరుకావాలని ఆయన కోరారు.